స్వార్థం

శ్రీమతి పి. జె. శాంతమ్మ

"అమ్మగారూ రేపు, పనికిరానండి సెల విప్పించాలి" అంది ఎంకి సిగ్గుతో తల వంచుకొని.

అమ్మగారి గుండెలో రాయిపడ్డట్ట య్యింది "ఏమే? ఏం తెగులు?" అంది కనుబొమలు ముడివేస్తూ అమ్మగారు.

ఆవిడను అందరు "అమ్మగారనే" పిలుస్తారులెండి. పేరేమిటోకూడా ఎవ్వరికీ తెలియదు. ఇంటినిండా డబ్బు మూలుగుతూ ఉంది. పిల్లాజల్లా లేరు. మరి ఆవిడ కుండే జబ్బుపనులతోగాని ఎప్పుడు మూలుగుతూనే ఉంటుంది. వంటావిడను పెట్టుకొంది. ఇక అన్ని పనులకు ఈ ఎంకే. దాది నౌఖర్లు దొరకని ప్రదేశంలో మధ్యాహ్నం భోజనంపెట్టి 8 రూ॥ ఇస్తుంది. చంద్రరావు గారి తొలిసంబంధంకు ఒక కుర్రాడు మాత్రమున్నాడు. పోనీ తనకు లేనేలేదు సంతానం, అని ఆ ప్రకాశరావునైన కడుపున పుట్టిన బిడ్డలాచూచుకొంటుందా? అంటే వాడు ఇంట్లో ఉంటేనే ఆమె ఒంటినిండా జెర్రెలు తేలుకుట్టేస్తున్నట్లుంటుందట. ఎంకి ఈవిడ దగ్గిరకు వచ్చి ఆరు నెల్లయ్యిందట. ఈవిడకు నచ్చినట్లు తిరుగుతుంది. వెనకాల మెటికలు విరిచినా, పైకి చాలా వినయంగానే కనబడుతుంది.

పాపం! ఎంకి తల్లిదండ్రులు పేదవాళ్లు. ఎనమండుగురు సంతానం. వాళ్లనాన్న పగలంతా కష్టపడి రెండు రూపాయిలు తెస్తాడు కూలి ఉన్నరోజుల్లో. లేనిరోజుల్లో పిల్లలను సముదాయించలేక వాళ్లమ్మ నూతిలోకూడ పడబోతే రెండుమార్లు రక్షించారు ఇరుగుపొరుగువారు. ఇప్పటికి రెండు సంబంధాలు వచ్చాయి ఎంకికి. అన్ని రైటైయ్యాక ఇలాగ అమ్మగార్ని సెలవడగడం, ఆవిడ సెలవియ్యకపోవడం, తప్పని సరి ముహూర్తపు రోజు వచ్చేసరికి "మీ పిల్ల మాకు నచ్చలేదు మేమురావడంలేదు" అని కబురు 'టెలిగ్రామ్‌లాగ' రావడం, అప్పుజేసి అమర్చి ఉంచిన పెళ్లి దినుసులన్ని వృథాగా అయిపోవడం. ఈ ఆరు నెలల్లోనే జరిగిపోయాయి.

ఈవేళ ఎంకి రేపటినుండి మూడు రోజులు తన పెళ్లిని గూర్చి సెలవడగ్గానే అమ్మగారికి వళ్లు తెలియనంత కోపం వచ్చింది.

"ఏమో! నాకేమి తెలియదు నేను సెలవియ్యను, ఒకవేళ నాకు చెప్పకుండా మానేస్తే ఇకమీద మీ బాబుకు కూలి పనికూడా చెప్పను."

"అయితే నేను లేకుండా నా పెళ్లి

ఎట్లా జరుగుతాదండీ, అంది ఎంకి ఆరి పోయిన పెదాలతో''

''ఛీ! పాడుముండా! కూలిముండలకు పెళ్లేమిటే? ఫో! అవతలకి నా ఎదుర గుండా నిలబడకు—పెరట్లో ఆరేసిన చీరెలు తెచ్చి కుచ్చిళ్లెట్టు'' అంది అమ్మగారు.

పాపం ఎంకి పొంగివచ్చే ఆవేశం, దుఃఖం ఆపుకొని కళ్లమ్మట రెండు నీటిబొట్లు రాల్చి గబగబ చీరలు తేడానికి పోయింది.

రాత్రి 8 గం॥లకు''అమ్మగారూ! సెలవు తీసుకొంటున్నానండి'' అంది ఎంకి చారు తపేళ అరిచేతిలో పెట్టుకొని.

''ఆ! వెళ్లు రేపు నేను కోవిలకెళ్తున్నా 6 గం॥లకే నీవు రావాలి సుమా'' అని హెచ్చరించింది.

''అమ్మగారు రేపు రానండి'' అంది ఎంకి తడబడుతూ''

''ఏమిటన్నావు రేపురాకపోతే నీయమ్మను పంపు. నీ చాకిరి అంత ఎవరు చేస్తాడను కొన్నావు'' అంది మంచం దిగి ఎంకి దగ్గిరగావచ్చి

''మా అమ్మలేకపోతే పెళ్ళివారి నెవరు మర్యాదచేస్తారండి'' అంది అమాయ కంగా కళ్లు త్రిప్పుతో.

''ఏమిటన్నావు? నీ పెళ్లి పెడాకులై పోను! నువ్వురాకపోయి, మీ అమ్మరాక పోతే ఈపనంతా ఎవరుచేస్తారు? అందులో ముష్టి పెళ్లికి మూడురోజులా? నేనొప్పు కోను.''

''పోనీ జీతం నాగా వెయ్యమన్నదండి మా అమ్మ''

''నాగా! వేస్తాను ఉండు. ఆ పెళ్లిసంగ తేంటో కనుక్కొంటాను వెళ్లు, వెళ్లు, ఇంకా నిలబడ్డావేం, పో'' అని తలుపులు దబాల్న వేసుకొంది అమ్మగారు.

ఎంకికి ఒక్కసారి గుండెలో రాయి బడ్డట్టైయింది. కళ్లనిండా నీళ్లూరాయి, ఆ చిరుగు పైటకొంగుతో నీళ్లు వత్తుకొని కచ్చా క్రిందకులాగుకొంటూ ఇంటిముఖం పట్టింది. త్రోవలో రామం తాత పలకరిం చేడు''ఏమే ఎంకీ! అంత దిగాలుగాఉన్నా'' వని పాపంఎంకి ఒక్కసారి బావురుమంది కళ్లువత్తుకుంటూ. ''అరెరె! ఏటేసంగతి అట్లా ఏడుస్తున్నావు?''అన్నాడు గాబరాగా. ''తాతా! ఒక మారు ఇంటికి రా అంతా చెప్తాను'' అంది దుఃఖందిగ మ్రింగుతూ.

''అయితేనడు నేను మీాయింటికే ఒక మారు వెళ్దామని బయలు దేరాను.'' అన్నాడు ''ఎంకీ! ఎందుకే ఏడుత్తున్నావు'' అన్నాడు తాత జాలిగా ''ఉండు తాత ఇంటికాడ చెప్తాను గుండెల్లోగాబరాగ ఉంది''అంది కాస్త ఆయాసంగా''ఊహూ'' అని ఇక తాత ఏమిఅనకుండా ఊరు కున్నాడు. సరే ఇంటికి వచ్చారు ఇద్దరును.

రాగానే ఎంకి తల్లి! సోమమ్మ ఆతృతగా అడిగింది. "ఏమే! సెలవిచ్చిందా?" అని "లేదమ్మా" అంతలో తండ్రి అందుకొన్నాడు "ఏం? పాడుముండ ఆపాటి సెలవియ్యడానికి దాని కొంప ఏంమునిగిపోంది. మరి పేదోళ్లకు పెళ్లిళ్లు జరక్కూడదన్న మాట" "ఉండరా! దాన్ని సంగతంతా చెప్పనీ, ఊ చెప్పే ఏమందో" అన్నాడు తాత కనుబొమలు ముడివేస్తూ. ఎంకి జరిగిన సంభాషణ అంతా చెప్పింది. ఆఖరుగా "ఉండు ఆ పెళ్లిసంగతేటో కనుక్కొంటాను అని అంది" అనికూడా చెప్పింది.

ఇక్కడ తాత "ఆగు. దాన్ని సెలవడగడం అది ఇయ్యక పోడం, ముందు ఇలాగే టకాయించడం ఆ రెండు సంబంధాలు సరిగ అమిరినవి ఆఖరుకు తప్పిపోవడంలో ఏదో ఈ పెళ్లిళ్లకు అమ్మగారికి సంబంధం ఉందని నా కనుమానంగా ఉంది" అన్నాడు. "ఛా! ఎంత పాపిష్ఠి ముండైన పెళ్లి చెడగొడతాదటయ్యా, తప్పు అది పని చేసులేక అలా ఏడుస్తాది" అన్నాడు ఎంకి తండ్రి సన్నాసి "ఒరే నోరు ముయ్యి ఆ గొడ్డుముండా ఎంతమంది నోట్లో మట్టోసిందనుకొన్నావు నన్నడగరాదాని గుట్టుమట్టు. అది పాపిష్ఠిముండరా దానికి డబ్బే ప్రధానం. దాని మొగుడికైనా కడుపు నిండా కూడెట్టదురా"

"సరే యింతకు పెళ్లి మూర్తం ఎప్పుడు?" "సాయంత్రం గం॥ 6-30."

"సరే నువ్వు ఎక్కడికి ఎల్లకే ఎంకీ ఈ పెళ్లి ఎలాగ అవదో నే చూత్తాగా-నా తడాకా" అంటూ చుట్టముట్టించుకొని "వత్తానే సోమమ్మా!" అంటూ లేచి వెళ్లిపోబోయాడు. "పెళ్ళి కొడుకు వాళ్లు ఇప్పుడొత్తారు మామా! నువ్వు లేకపోతే ఎలా? ఈ రేత్రికి ఇక్కడే తొంగో" అంది. "చరే," ఆ తాత మెడమీదఉన్న చింకిపాత దండిమీద వేసి నులక మంచంమీద కూర్చున్నాడు. అంతలో డప్పులు వాయిద్యం "అదుగో పెళ్ళివారు వత్తున్నారు" అంటూ అంతా లేచారు ఎదురు డప్పుల వాయిద్యాలతో పక్క వీధిలో ఉన్న మిద్దింట్లో విడిదికిదింపారు. అందరు పడుకొన్నారుగాని "తాత డిబ్బీ దీపందగ్గర చుట్టలు చుట్టుకుంటూ కూర్చున్నాడు." అందరు నిద్రపోయాక మెల్లిగా లేచి ఎక్కడికో వెళ్లడు అమ్మగారి నౌఖరి తెల్లవారుజామున పెళ్లివారి విడిదికి వెళ్లాడు. ఆ టైముకు అందరు లేచి ముఖాలు కడుక్కుంటున్నారు. "ఓహో! ఏవూరు బాబూ మనది" అని పలకరించాడు పెళ్లి కొడుకుతండ్రిని. "మాది రాంబద్రపురమండి మీరెవరండి" "మీ కోడలుగారు నేను ఒక దగ్గిరే నౌఖరి ఉన్నామండి" అన్నాడు తమాషాగా "అయితే ఆ అమ్మాయి చాలామంచి పిల్లటకదండి" అన్నాడు మరొకతను. "ఆ! చాలమంచిదండి బాబూ! వెయ్యిఅబద్ధాలాడైన ఒక పెళ్లి

చెయ్యాలన్నారు పెద్దలు. నాకెందుకు బాబూ! నాలుగు రోజుల్లో మీకే తెలుస్తాది ఆ మంచి'' అన్నాడు 'వాళ్ళలో అనుమానంపుట్టేలాగ కళ్లు తాటిస్తూ. ''ఆ! అదేటో చెప్పగూడదండి'' ''అబ్బే మీతో నేనంటే మాత్రం నమ్మతారా? ఇది నాలుగోమాసం ఆ పిల్లకి దానిసంగతి తెలిసే ఇదివరకు రెండు సంబంధాలు పోయాయి. అయినా నాకెందుకు బాబూ ఒకరిగొడవలు'' అంటూ లేవబోయాడు. మరి ఇంత సేపు ఎక్కడ ఉన్నాడో గాని తాత, గబాల్న వాడి రెండుచేతులు వెనక్కి పట్టుకొని ఒక్కతన్ను తన్నాడు ప్రక్కలో. ''చచ్చాన్రోయి'' అని పడ్డాడు ఆ రంగడు, ''లం......కొడక ఎవరికిరా నాలుగోమాసం, చెప్పు వెదవనాగన్నా! చంపేత్తాను పేగులాలిచేత్తాను'' అంటూ ఎడాపడా దవడలు వాయించేస్తున్నాడు. అందరు చుట్టూమూగారు. తాతను పట్టుకొన్నారు గాని తాతవాళ్లను తోసేస్తున్నాడు; సింహగర్జన చేస్తున్నాడు. ఎలాగయితే కాస్తవాడికి తెలివి వచ్చేలాగు వేడిగంజీ అంతాపోసి లేచి కూర్చోబెట్టి సంగతంతా అడిగారు వాడు చెప్పడం మొదలు పెట్టేడు ''అమ్మగారు, ఎంకి లేకపోతే ఒక్కక్షణం సంసారం ఈదలేదట. అసలు ఈఊర్లో నౌఖర్లు దొరకటం కష్టం. అందులో ఇది పిసినారి. దానికి పెళ్లయితే మొగుడితో కాపురానికిపోతాది. అప్పుడు ఇంత తక్కువజీతానికి ఎక్కువసుఖం ఇచ్చే నౌఖర్లు దొరకరట. కనుక ఆ వచ్చిన రెండు సంబంధాలను నేనే ఇలాచెప్పి వెళ్లగొట్టాను అమ్మగారి మాటమీద. వీళ్లని కూడా ఇలా వెళ్లగొడితే ఎంకికి ఇక పెళ్లి అవదు. అమ్మగారిదగ్గిర ఎంకి ఉంటుందని ఆవిడప్లాను'' అని పాపం బెక్కి బెక్కి ఏడుస్తూచెప్పేసాడు రామయ్య

''ఒరే అది ఇలా ఎన్నికొంపలు కూలదోస్తుందో! డబ్బుగలది గనుక కమ్ముకుపోతున్నాయి. నువ్వు మాలాటి పేదోడివి గదా ఈ కుక్కబుద్ధి నీకెక్కడ దాపరించిందిరా? దొంగనాయాలా! ఏమివచ్చిరదిరా? చెప్పు మళ్లా తగల్నిచ్చేదా ?చెప్పు మూడు రూపాయిలు చూసావా! ఇల్లాంటి ఘోర కార్యాలు చేయించేటప్పుడు సైతం అట్టేడబ్బు కర్చు పెట్టదు గొడ్డుముండ. పో! గాడిదా! మళ్లాఎప్పుడైనా ఇలాటి పనిచేస్తావా – పీక నులివేస్తాను తెలిసిందా'' అంటూ బయటకు ఒక్కతోపుతోసాడు తాత.